క్లుప్తంగా

వీఆర్ కృష్ణతేజకు శుభాకాంక్షలు



తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ , గ్రామీణ అభివృద్ధి శాఖ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వి.ఆర్. కృష్ణతేజకు మంగళవారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందు వెంకట సాంబశివరావు, సూర్య ప్రకాష్, బీరం జానకిదేవి, అశోక్ కుమార్, ఎస్. లలితకుమార్, పూల నాగమణి, ఆరుదల సాంబశివరావు, మబ్బు శిరీషా సుధాకర్, బుచ్చిబాబు, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై సర్వే



ఫిరంగిపురం : మండలంలోని పలు గ్రామాల్లో లెప్రసీ సర్వే నిర్వహిస్తున్నట్లు నుదురుపాడు పీహెచ్‌సీ , ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఫరీనాబేగం, శ్వేతలు మంగళవారం తెలిపారు. సర్వేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మచ్చలు ఉంటే గుర్తిస్తున్నట్లు చెప్పారు. వారికి పరీక్షలు చేసి లెప్రసీ ఉన్నవారిని గుర్తించాక మందులు అందజేస్తారన్నారు. వచ్చే నెల 2వతేదీ వరకు దీనిపై సర్వే ఉంటుందని చెప్పారు.

సాగు పనుల్లో పత్తి రైతులు



తాడికొండ: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పత్తి రైతులు ఎరువుల యాజమాన్యం మొదలు పెట్టారు. ఈ ఏడాది పత్తి విస్తీర్ణం పెరగడంతోపాటు వర్షాలు సకాలంలో కురుస్తుండటంతో ఇప్పటి వరకు పంటకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏపుగా పెరుగుతోంది. 24 గంటలుగా వర్షం తగ్గుముఖం పట్టి వాతావరణం అనుకూలంగా మారడంతో రైతులు ఎరువులు చల్లే పనిలో నిమగ్నమయ్యారు.

హిందూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఎం.ఫార్మసీలో ప్రవేశానికై జాతీయస్థాయిలో నిర్వహించిన జీప్యాట్–2024 ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీప్యాట్–2024లో ప్రవేశ పరీక్షకు తమ కళాశాల నుంచి హాజరైన 30 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని, వీరందరూ ప్రముఖ విశ్వ విద్యాలయాలతో పాటు నైపర్‌లో తమకు నచ్చిన బ్రాంచ్‌లో ఎం.ఫార్మసీలో చేరేందుకు అర్హత పొందారని వివరించారు. షేక్ అఫ్రిన్ బేగం 3,186వ ర్యాంకు, బి.సంధ్యారాణి 8,213వ ర్యాంకు, ఏ. చెన్నకేశవ 10,745వ ర్యాంకు, బి. లక్ష్మీ శ్రావణి 11,213వ ర్యాంకు సాధించారని తెలిపారు. జీప్యాట్ ద్వారా ఎం.ఫార్మసీ చదివే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తుందని, ఆ తరువాత ప్రభుత్వ సంస్థల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, జీప్యాట్ కోచింగ్ ఇన్‌చార్జ్ సీహెచ్ ప్రసాదరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎ.ప్రత్యూష, అధ్యాపకులు అభినందించారు.

రాజధాని గ్రామాల్లో మంత్రి నారాయణ పర్యటన

ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కలిసి భవనాల పరిశీలన



నిర్మాణాల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

తాడికొండ: రాజధాని గ్రామాల్లో మంగళవారం ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కలిసి అమరావతి స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మిస్తున్న పలు భవనాలను పరిశీలించారు. వెంకటపాలెంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్, ఈ–హెల్త్ సెంటర్, మందడంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని కూడా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని, గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని, శాఖల వారీగా చేసిన కేటాయింపులు ఇతర అవసరాలకు ఖర్చు పెట్టేసిందని ఆరోపించారు. మూడు ముక్కలాట ఆడి అమరావతిని గత ప్రభుత్వం నాశనం చేసిందని, వీలైనంత త్వరగా అమరావతి ప్రాజెక్టు పూర్తి చేసేలా ముందుకెళుతున్నామని చెప్పారు. 100 రోజుల్లో వంద అన్న క్యాంటీన్లు ప్రారంభించేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజధానిలో ముళ్ల కంప తొలగించేందుకు టెండర్లు పిలిచారని, ముఖ్యమంత్రి తొలి పర్యటనలో ఈ ప్రాంతంలో ఏం చేయాలనే దానిపై ఆదేశాలిచ్చారన్నారు. పలువురు సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సవరణలకు శిబిరాలు

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి, తక్కెళ్లపాడు గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు మంగళవారం ఏర్పాటు చేశారు. దానిలో భాగంగా 20 మంది కొత్తగా నమోదు కోసం వచ్చినట్లు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కె.విష్ణువర్ధన్ రావు, వెంకట్రావులు తెలిపారు. బయోమెట్రిక్ కోసం 11, ఆధార్‌లో తప్పొప్పులు సరి చేయించుకునేందుకు తొమ్మిది మంది వచ్చినట్లు చెప్పారు. ఆయా గ్రామాల ఆధార్ క్యాంపుల్లో డీఏలు కె.అరుణ, గణేష్‌భార్గవ్‌లు పాల్గొన్నారు.

అమరావతి మండలంలో..

అమరావతి: మండల పరిధిలోని గ్రామాలలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో జి. రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నెమలికల్లు, మల్లాది, పెదమద్దూరు గ్రామాలలో క్యాంపులు జరిగాయన్నారు. 24 వ తేదీన కర్లపూడి, జూపూడి, లింగాపురం, 25న ఎండ్రాయి, మునగోడు, అమరావతి–1 సచివాలయాలలో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. 26న ధరణికోట–1, అత్తలూరు, అమరావతి–2 సచివాలయాలలో, 27న ధరణి కోట–2, దిడుగు, నరుకుళ్ళపాడు గ్రామ సచివాలయాలలో క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

పారిశుధ్య లోపం వల్లే వ్యాధుల తీవ్రత

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోను పారిశుధ్యం క్షీణించి డయేరియా, డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు ప్రబలి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో నగర సీపీఐ పార్టీ సమితి సభ్యుల విస్తృత సమావేశం నగర కార్యవర్గ సభ్యురాలు గుండెబోయిన లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకి అనేకసార్లు మొరపెట్టుకున్నా ఫలితం కాన రాలేదని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి పైన అపరిష్కృతంగా ఉన్న సమస్యల పైన దృష్టి పెట్టాలన్నారు. అందుకు స్థానికంగా ఉన్న పార్టీ శాఖలు కదలి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ ఉన్న ప్రతి ప్రాంతంలో ప్రజా సమస్యలు ఉత్పన్నమైన వాటి పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మోదీ ప్రభుత్వం అత్యంత ప్రమాదకరంగా మారిందని, మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు జరుపుతూ దేశ సౌభ్రాతృత్వానికే ప్రమాదం వాటిల్లే విధానాలను అమలు జరుపుతున్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా జరిగే పోరులో సీపీఐ నాయకులు, కార్యకర్తలు విరోచిత పాత్ర నిర్వహించాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు నగర సమగ్ర అభివృద్ధి కోసం నగరంలోని పార్టీ శాఖలన్నీ పోరాట కార్యక్రమాలకు సిద్ధం కావాలని, నగరంలోని శాఖలన్నీ క్రియాశీలంగా పనిచేయాలన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయాలి

గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్

ప్రత్తిపాడు: బీసీజీ వ్యాక్సిన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఏఎన్‌ఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరి యునిస్ మాట్లాడుతూ గ్రామాల్లో మధుమేహం ఉన్న వారికి, ధూమపానం చేసే వారిని, 60 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి వారికి బీసీజీ వ్యాక్సిన్ వేయాలన్నారు. అదే విధంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రతి ఇంటికీ ఆశా కార్యకర్త వెళ్లి సర్వే చేయాలన్నారు. అనుమానితుల వివరాలను ఏఎన్‌ఎంలకు తెలియజేయాలని చెప్పారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లలో ఎలాంటి అలసత్వాన్ని వహించవద్దని, ప్రతి యాంటినేటల్‌కు నాలుగు సార్లు పరీక్షలు చేయించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, పీహెచ్‌ఎన్ నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

ప్రతిభ చాటిన విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు



అర్హత సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్ : ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తోందని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. మంగళవారం పెదపలకలూరులోని కళాశాలలో లియోరా డిజిటల్ అమిగోస్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ నైపుణ్యత కలిగిన విద్యా విధానం, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో తమ కళాశాల విద్యార్థులు ఉపాధి పొందగలుగుతున్నారన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి గోపాలకృష్ణ, ఇన్‌చార్జి రామిరెడ్డిలు మాట్లాడుతూ లియోగా డిజిటల్ అమిగోస్ సంస్థలో ఇంటర్న్‌షిప్ కోసం ప్రతిభ కలిగిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను సంస్థ డైరెక్టర్ జె.బోయస్‌రాజు, ఆపరేషన్స్ మేనేజర్ షేక్ ఇమ్రాన్, పాలిశెట్టి శేషసాయి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.దుర్గాప్రసాద్ తెలిపారు. ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చర్చించడం జరుగుతుందని చెప్పారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

ప్రత్తిపాడు: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక కేటాయింపులు చెయ్యడం హర్షణీయమని బీజేపీ సీనియర్ నాయకుడు జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించటంపై జంధ్యాల హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించడంతో పాటు, వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు నిధులతో పాటు వెనుకబడిన ఏడు జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించటాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'రాష్ట్రానికి అన్యాయం'



పొన్నూరు: బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెడుతోన్న బడ్జెట్‌లో గత పదేళ్లుగా రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టేందుకు అంకెల గారడి చేస్తుందని పొన్నూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఇకనైనా బీజేపీ రాష్ట్రానికి మేలు చేసే దిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం పార్లమెంటులో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్, 2014 నుంచి నేటి వరకు ఇది 11వ బడ్జెట్ అని, అన్ని బడ్జెట్‌లలో రాష్ట్రానికి బీజేపీ ఇచ్చింది శూన్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం రాష్ట్రానికి రూ.15 లక్షల కోట్లు అవసరం ఉండగా అది నేడు రూ.20 లక్షల కోట్లకు చేరిందని, కేంద్రం ప్రకటించిన రూ.15 వేల కోట్లు ఏ మూలకు వస్తాయో వారే తెలపాలని ప్రశ్నించారు. అంకెలతో మభ్యపెట్టకుండా, కేవలం ఆంధ్రప్రదేశ్ ఎంపీలతో మూడోసారి అధికారంలోకి వచ్చామన్న కృతజ్ఞతతో బీజేపీ వ్యవహరించాలని తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు



గుంటూరు రూరల్: యువతి అదృశ్యంపై నల్లపాడు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్జీవో కాలనీ, 12వ లైను నల్లకుంటకు చెందిన రేపూడి సుమ ఈ నెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తండ్రి రేపూడి ఎలీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. యువతికి 20 సంవత్సరాలు ఉంటాయని, మతి స్థిమితం లేదని ఆచూకి తెలిసిన వారు నల్లపాడు పోలీస్ స్టేషన్ 86888 31376, 86888 31590 సెల్ నంబర్లకు తెలియజేయవచ్చన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న భాజపా నేతలు

తాడికొండ: అమరావతి రాజధాని శంకుస్థాపన ప్రాంతంలో బీజేపీ నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఏపీలో రాజధాని నిర్మాణానికి కేంద్ర బడ్జెట్లో రూ.15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమని హర్షం వ్యక్తం చేస్తూ నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు తొండెపు రామసేవ గుప్తా మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రధాని నిధులు కేటాయించారన్నారు. పోలవరం బాధ్యత తమదేనని కేంద్రం హామీ ఇవ్వడం, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక కేటాయింపులు వంటివి భాజపా చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సరకా కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కంతేటి బ్రహ్మయ్య, గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి నీరుకొండ లక్ష్మీనారాయణ, తుళ్ళూరు మండల అధ్యక్షుడు సరిపూడి సాంబశివరావు, ఉపాధ్యక్షులు మార్త నరేంద్ర బాబు, బత్తుల వెంకట్రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మంత్రి ప్రకటన హర్షణీయం

తాడికొండ: కేంద్ర బడ్జెట్లో ఏపీ రాజధానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమని తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌పై స్పందించి ఆయన మాట్లాడుతూ.. ఏ రాష్ట్రానికి ఇవ్వని రీతిలో ఆంధ్రప్రదేశ్‌కు నిధులివ్వడం డబుల్ ఇంజిన్ సర్కారు బీజేపీ ద్వారానే సాధ్యమైందని పేర్కొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



నోట్‌బుక్స్, స్టేషనరీ అందిస్తున్న కొండ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలో విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. కుంచనపల్లికి చెందిన కొండ సుబ్బారెడ్డి, సుబ్బమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు కొండ శ్రీనివాసరెడ్డి ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. 20 సంవత్సరాలుగా మండల ప్రజాపరిషత్ పాఠశాలలో వీటి పంపిణీ ఏటా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మేరీ సహాని మాట్లాడుతూ.. శ్రీనివాసరెడ్డి ఇలా సాయం అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమర శివనాగేశ్వరరావు (నాగయ్య) కుంచనపల్లి అధ్యక్షులు మిరియాల రాంబాబు, యువజన నాయకులు దొంతిరెడ్డి తిరుమల రెడ్డి, గడ్డం తాతారావు (తాతయ్య), మాజీ సర్పంచ్ బిరుదుగడ్డ విజయేంద్రరావు, చాగంటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ చైర్ అభివృద్ధికి కృషి

నూతన డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్



ఆచార్య పీజే రత్నాకర్‌ను సన్మానిస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు

ఏఎన్‌యూ: యూనివర్సిటీలోని బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని నూతన డైరెక్టర్ ఆచార్య పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ తెలిపారు. బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా నియమితులైన ఆయన గత కోఆర్డినేటర్ ఆచార్య కె.మధుబాబు నుంచి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పూలే, అంబేడ్కర్ అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు ఆచార్య త్రిమూర్తిరావు, ఆచార్య అశోక్ కుమార్‌లు నూతన డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య రత్నాకర్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేసిన లక్ష్యాల సాధనకు ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తానన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలు, లక్ష్యాలపై విస్తృతంగా పరిశోధనలు జరిపించడంతోపాటు, ఆయన జీవిత ఘట్టాలు, అణగారిన వర్గాలకు చేసిన సేవలను సమాజానికి చేరువ చేస్తానని తెలిపారు. ఢిల్లీలోని బాబూ జగ్జీవన్‌రామ్ ఫౌండేషన్‌ను సంప్రదించి అధ్యయన కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటేశ్వరరావు, పలువురు పరిశోధక, విద్యార్థి సంఘ నాయకులు, సిబ్బంది నూతన డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

ప్రాథమిక దశలోనే విద్యార్థులపై దృష్టి పెట్టాలి

ఎంఈవో సీహెచ్ రమాదేవి



బాలల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు రమాదేవి, లీలారాణి

ప్రత్తిపాడు: ప్రాథమిక పాఠశాల దశ నుంచే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌ల్లో చదవడం, రాయడం నేర్పించాలని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. మండల పరిధిలోని కొండేపాడు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవో సీహెచ్ రమాదేవి, ఎంఈవో–2 లీలారాణిలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను సబ్జెక్టుల వారీగా పరీక్షించారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ నైపుణ్యం సాధించేలా ప్రైమరీ లెవల్ నుంచే ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీపడకుండా నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డికి సూచించారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదు




ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి

కాకుమాను: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయించాలని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మండల కేంద్రం కాకుమానులో మంగళవారం ఎరువులు, విత్తన దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్‌లో దుకాణ యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో ధరల పట్టికను ఏర్పాటు చేయడంతో పాటు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే రైతులు స్థానిక వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు. దుకాణాలలో ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు.

దంపతుల్లో పెరుగుతున్న సంతానలేమి

పెళ్లి కాకముందు 'పప్పన్నం ఎప్పుడు పెడతావ్' అనడగుతారు. పెళ్లయిన తరువాత 'ఏమన్నా విశేషమా' అంటూ బంధువులు గుదిగుచ్చి మరీ అడుగుతారు. వారి ప్రశ్నల్లోని అంతరార్థం.. ఇద్దరు 'ముగ్గురు' ఎప్పుడు అవుతున్నారని తెలుసుకునేందుకే. కానీ ఇవాళ నట్టింట్లో పిల్లలు నడయాడటం అన్నది దంపతులకు పెద్ద సమస్యగా మారింది. ఆలస్యంగా వివాహాలు కావడం, ఒత్తిడులు వంటివన్నీ సమస్యకు ఆజ్యం పోస్తున్నాయి. 'అమ్మదనం', అమ్మా–నాన్న అనే పిలుపు కోసం ఎన్నో జంటలు ఇవాళ వైద్యశాలల మెట్లు ఎక్కి దిగివెళుతున్న ఘటనలు చాలా ఉంటున్నాయి.

- ఆధునిక జీవనశైలితో సమస్యలు
- సంతానం కోసం వైద్యులను సంప్రదిస్తున్న జంటలు
- అనుమతి ఉన్న ఐవీఎఫ్ కేంద్రాలకు వెళ్లాలని అధికారుల సూచన
- రేపు వరల్డ్ ఐవీఎఫ్ డే



గుంటూరు మెడికల్: అమ్మ అనే పిలుపు కోసం మహిళలు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. ఆధునిక జీవనశైలి వల్ల నేడు సంతానలేమి సమస్యలు పెరిగిపోతున్నాయి. వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలుగక బాధపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. సంతానలేమి సమస్యలు పెరిగిపోవటంతో వారికి వైద్యసేవలను అందించేందుకు ప్రత్యేక ఆస్పత్రులు, ఐవీఎఫ్ సెంటర్స్ గుంటూరులో నూతనంగా చాలా వచ్చాయి. మొట్టమొదటిసారిగా 1978 జులైలో యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఐవీఎఫ్ ద్వారా లూయిస్ బ్రౌన్ బిడ్డకు జన్మనిచ్చింది. మొట్టమొదటి టెస్ట్‌ట్యూబ్ బేబీగా వరల్డ్ రికార్డు కెక్కింది. ప్రతి ఏడాది జులై 25న వరల్డ్ ఐవీఎఫ్ డేగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

మగవారిలో సంతానలేమికి కారణాలు

మగవాళ్లలో దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ సంతానలేమికి దారితీస్తోంది. స్మోకింగ్, ఆల్కహాల్, డ్రగ్స్, కొన్ని రకాల మందులు వాడటం వల్ల కూడా సంతానలేని సమస్య ఉత్పన్నమవుతుంది. సుఖవ్యాధులు, టీబీ, బీర్జాలకు గాయాలవ్వటం, దెబ్బలు తగలటం, అంగం సైజుల్లో తేడాలు, పని ఒత్తిడి వల్ల సంతానలేమి సమస్యలు వస్తున్నాయి. కంప్యూటర్‌ను 6 నుంచి 8 గంటలపాటు వినియోగించటం, రాత్రివేళల్లో ఎక్కువగా సెల్‌ఫోన్ మాట్లాడటం, వీర్యకణాలు తక్కువగా ఉండటం, రాత్రివేళలో నిద్రపోకుండా ఉండటం, హార్మోన్ సమస్యలు, గర్భనిరోధక సాధనాలు ఎక్కువగా వాడటం వల్ల సమస్యలు వస్తున్నాయి.

ఆడవారిలో పిల్లలు పుట్టకపోవడానికి కారణాలు...

పెళ్లైన ఏడాది పాటు ఎలాంటి గర్భనిరోధక పద్ధతులు పాటించకుండా దాంపత్య జీవితాన్ని కొనసాగించినా గర్భం రాకపోవటాన్ని వంధత్వం అంటారు. ఆడవాళ్లలో సంతాన లేమికి కారణాల్లో ఆలస్యంగా అంటే 35 సంవత్సరాల వయస్సులో పెళ్లి చేసుకోవటం. ఆలస్యంగా రజస్వల అవ్వటం. అండం విడుదల అవ్వకపోవటం, హార్మోన్ల సమస్య, గర్భసంచి, కడుపులో ఇన్‌ఫెక్షన్లు, గర్భసంచి ట్యూబ్‌లు మూసుకుపోవటం, పీసీఓడీ, జునైటైల్ టీబీ, బీపీ, షుగర్, జీవనశైలి, అధిక మానసిక వత్తిడి, అధిక బరువు, అండం విడుదల జరిగే సమయంలో దాంపత్యంలో పాల్గొనకపోవటం, దాంపత్యం కోసం మూఢనమ్మకాలు పెట్టుకుని ఆచరించటం, సెక్స్‌పై అవగాహన లేకపోవటం ఇలా ఎన్నో కారణాలు లేకపోలేదు.

ఆధునిక చికిత్సలతో సంతానం

సంతానం కోసం చింతించే వారికి ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) విధానంలో భార్య అండాన్ని, భర్త శుక్రకణాల్ని ఇంక్యుబేటర్‌లో పెట్టి రెండు నుండి ఐదు రోజుల్లో పిండం తయారయ్యాక ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో పిండాన్ని పెడతారు.. భర్త శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉంటే ఇక్సీ విధానం ద్వారా, సంఖ్య జీరో అయితే టీసా పద్ధతి ద్వారా బీర్జాల్లో నుండి సిరంజి ద్వారా వీర్యకణాలు తీసి ఫలదీకరణం చెందించి పిండాన్ని తయారు చేసి గర్భంలో పెడతారు. ఇంట్రాయుటైన్ ఇన్‌సెమినేషన్ (ఐయుఐ) విధానంలో భర్త శుక్రకణాలు తీసి ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో ప్రవేశపెడతారు. భార్య గర్భసంచి పిండం మోసే స్థితిలో లేకపోయినా, ఆమె ఆరోగ్యరీత్యా గర్భం రాకూడదని వైద్యులు నిర్ధారిస్తే సరోగసి ద్వారా (అద్దెగర్భం) సంతానం పొందవచ్చు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

లక్ష్మీపురం: భారతీయ మజ్దూర్ సంఘ (బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుపుకోవడం చాలా సంతోషదాయకంగా ఉందని బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.రమేష్ అన్నారు. స్థానిక గుంటూరు అరండల్‌పేటలోని హెడ్ పోస్టాఫీసు వద్ద భారతీయ మజ్దూర్ సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పోస్టమెన్, ఎం.టి.ఎస్ గుంటూరు డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా హెడ్ పోస్టాఫీసు ముందు జెండాను ఆవిష్కరించి నినాదాలు చేశారు.